# ఉపాధి కూలీలకూ బయోమెట్రిక్

**గంపలగూడెం, న్యూస్‌టుడే:** జిల్లాలో ఉపాధి హామీ పథకం పనుల్లో పాల్గొనే కూలీలకు బయోమెట్రిక్ అమలుకు రంగం సిద్ధమైంది. జిల్లాలోని గంపలగూడెం, మచిలీపట్నం, బాపులపాడు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. గంపలగూడెం మండలంలో రాజవరం గ్రామాన్ని బయోమెట్రిక్ అమలుకు ఎంపిక చేశారు. రాజవరంలో సోమవారం పాల్గొనే కూలీలకు బయోమెట్రిక్ ద్వారా హాజరు తీసుకునే కసరత్తు నిర్వహిస్తారని స్థానిక ఏపీవో వెంకటేశ్వరరావు తెలిపారు. పనుల్లో పాల్గొనే కూలీలకు నిర్దేశిత యంత్రాలతో వేలిముద్రలు, ఐరిస్ తీసుకుంటారు. సదరు కూలీలకు పనికి తగిన వేతనం నేరుగా బ్యాంకులో జమచేస్తారని తెలుస్తోంది. ఉపాధి పనుల్లో పాల్గొనే కూలీల్లో బినామీలు లేకుండా నియంత్రించేందుకు బయోమెట్రిక్ ఉపయుక్తంగా ఉంటుంది. యంత్రాల ద్వారా కూలీలకు హాజరు నమోదు చేయాలంటే ఆ గ్రామాల్లో అంతర్జాల సౌకర్యం ఉండాలి. సర్వర్ అనుసంధానం కచ్చితంగా పనిచేస్తేనే పని చేసే ప్రదేశం నుంచి బయోమెట్రిక్ హాజరు విజయవంతమవుతుంది.



రాజవరంలో ఉపాధి పనుల్లో పాల్గొన్న కూలీలు.

# రాజవరంలో ప్రయోగాత్మకంగా ఈ-మస్టర్

**రాజవరం(గంపలగూడెం), న్యూస్‌టుడే:** మండలంలోని రాజవరంలో ఉపాధి కూలీలకు ఈ-మస్టర్ అమలును సోమవారం ప్రయోగాత్మకంగా చేపట్టారు. హైదరాబాద్ నుంచి సంబంధిత సాఫ్ట్‌వేర్‌పై అవగాహన కల్పించేందుకు వచ్చిన నిపుణులు పవన్‌కుమార్ సోమవారం ఉదయం రాజవరం చేరుకుని పని ప్రదేశంలో కూలీల నుంచి బయోమెట్రిక్ తీసుకున్నారు. ఎంపీడీవో కె.ప్రభాకరరావు, ఏపీవో వి.వెంకటేశ్వరరావు ఈమస్టర్ నమోదును పరిశీలించారు. తొలుత పని ప్రదేశంలో సిగ్నల్స్ అందక సాఫ్ట్‌వేర్ పనిచేయలేదు. మధ్యాహ్నం నుంచి పనిచేయడంతో తొలిరోజు పనుల్లో పాల్గొన్న నలుగురు కూలీల నుంచి బయోమెట్రిక్ తీసుకున్నారు. మంగళవారం నుంచి పూర్తిస్థాయిలో అమలుచేస్తామని ఎంపీడీవో ప్రభాకరరావు తెలిపారు. ఈవోపీఆర్డీ సీహెచ్.శ్రీనివాస్, మాజీ సర్పంచి బి.సత్యనారాయణ పాల్గొన్నారు.



రాజవరంలో ఉపాధి కూలీ నుంచి ఐరిస్ తీసుకుంటున్న అధికారులు